


# ప్రమోషన్

## గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు

"ట్రింగ్, ట్రింగ్, ట్రింగ్, ట్రింగ్."

"హల్లో! హిస్టరీ లెక్చరర్ హియర్. మీరు... హోహో, కామర్స్ మాస్టారా! వూళ్ళో కొచ్చారా? మా కాలేజీకి రాక పోయారా! ఆఁ. ఏమున్నాయండీ! ఏదో ఇల్లా ఉన్నాం. సిలబస్సు లయిపోయాయి లెండి. ఏమిటీ ప్రిన్సిపాల్ శూలహస్తం తెలుసా అంటారా! భలేవారే! తేలిక పాటమేంటండీ! శ్రీకాకుళం జోన్ వాడు. ఎట్లా ఉంటాడంటే ఏం చెబుతామండీ? ఎవడిష్టం వాడిది. భారద్దేశం కదా! ఏమైనా మనిషి సరసమైన వాడు కాడండీ. మంచితనమూ, మచ్చుక్కూడా ఉన్నట్టు కనిపించదు! కాజువల్ లీవ్ లెటరిస్తే నేల కేసి కొడతాడు. కుర్రాళ్ళతో డీలింగు విషయం... చెప్పకండి, బాబోయ్. ఎల్లిమీద పిల్లిని, పిల్లిమీద వల్లిని, మల్లిమీద బల్లిని ఎక్కించి బంధించటమే కాదండీ ఆయన చేసే పని! ఏనాడైనా క్లాసుల్లోకెళ్ళి వాళ్ళెలా న్నారా పూడారా చూశాడా! అబ్బే, కాలేజీ కొచ్చాడంటే కుర్చీకి అతుక్కు పోయా డన్నమాటే! ఏం చేస్తాడంటారా— బిల్లులండీ, బాబూ, బిల్లులు! మటుక్కూ కాష్ బుక్కులు పరుచుకుని, 'తదరినాం నాం' అని సంగీతం పాడుకుంటాట్ట! లెక్చరర్సును ఏం అనడా అంటారా, ఎందుకంటాడు? వాళ్ళకీ ఆయనకీ బ్రహ్మాండంగా కలిసి పోతేనూ! ఈయన క్కావలిసిన సంతకాలూ, వోచర్లూ వాళ్ళు పెట్టేస్తూంటేనూ! ఇద్దరు కుర్రాళ్ళు క్లాస్ టెస్ట్‌లో ఫెయిల్ అయితే వాళ్ళని డైరెక్ట్‌గా సస్పెండ్ చేసేశాడు. అక్కడి నుంచీ వాళ్ళు నిరసన, బాయ్‌కాట్, స్ట్రైకు వరసగా సిస్టమాటిక్‌గా జరిపేశారు. గమ్మత్తేటంటే, ఇప్పుడు, వాళ్ళే ఆయనకి నమ్మినబంట్లు! వైసెస్ విషయం చెప్పేదేముందండీ, బాబూ! క్లబ్బులో పేకాడు తూన్నప్పుడు చేతిలోకి రాణిముక్కొస్తే ఒహా పట్టాన దాన్ని దించడే! దాన్ని వేళ్ళతో తడుముతా డెందుకంటారు? మత్తులో ఉన్నా కూడా అదేం పనండీ! మత్తులో ఉన్న వాడికి సహజ లక్షణాలు బయట కొస్తా యనేది మనకు తెలియంది కాదు గదా! అబ్బే, అతగాడు ఒట్టి డాష్ డాష్ అనుకోండి! పొద్దున్నే ఆయన పేరు స్మరించుకుని లేస్తే నరకం ఖాయం! సర్లెండి, ఎక్కడో ఉన్నా యన్ని గురించి మన కెందుకు లెండి!

"ఆఁ. ఏమిటీ, ఆయన్ని జోన మార్చారా? మా కాలేజీకే ట్రాన్స్‌ఫర్ చేశారా! చంపేశారు! చెప్పరేమండీ, మరి! ఏమిటో వద్దనుకున్నా నా చెవిని పడు తూంటాయి కదా దుర్వార్తలు! నా కెందుకయ్యా ఇవన్నీ చెబుతా వన్నాను. అయినా ఆ సుబ్బారావ్ వినందే! ఇంకో పావు గంట నుంచునుంటే ఆ నిస్వార్థ వ్యక్తి శ్రీ శ్రీ శ్రీ శూలహస్తంగార్ని గురించి ఎన్నెన్ని అపనిందలూ, అపభ్రంశాలూ వినాల్సొచ్చేదో! అందు కనే "చాల్చాల్లేవయ్యా ఆయ నెంతటి పెద్దమనిషో నే నెరగనా! అవార్డుకు తగినవాడు!" అనొచ్చేశాను కానీ, లేక పోతేనా! నా బెస్టు ఫ్రెండు కదండీ ఆయన. ఏమిటీ, లెక్చరరు సుబ్బారావు ఇప్పుడు మీ పక్కనే ఉన్నాడా అం, మం... మరి... చ, చ, శ్రీ శ్రీ ఈ సుబ్బారావుగారు కాదండీ నేన్చెప్పేదీ అటెండరు సుబ్బారావు అటెండరు సుబ్బారావు. అటెండరు సుబ్బారావని ఒహడున్నా డ్లెండి అక్కడ! ఆఁ, ఆఁ అటెండరు, అటెండరు. అతను అక్కడి మెయిలువలస వాడే కదండీ మరి అందుకని శ్రీ శూలహస్తంగారంటే మెపు. అయినా, మాస్టారూ, ఎవడి పాపాన వాడే పోతాడనేది మనకు తెలీదా, మాట్టం లేదా? నేను చేసిన తప్పొప్పులకి నేనే గదా బాధ్యుణ్ణి! అహా నేను చాలా నిజాయితీ పరుణ్ణనీ, అధికారం కోసమూ, డబ్బు కోసమూ అర్రులు చాచేవాణ్ణి కాదనీ నేను చెప్పుకుంటే బాగుండదు. కానీ నా కన్నులు అవ్వంటే మంట. ధర్మం జయిస్తుందండీ, బాబూ ధర్మమే జయం! ప్రిన్సిపాల్ పోస్టనేది కత్తిమీద సాములాయిపోయింది. నే నసలు లెక్చరరుగానే ఉండిపోతే బాగుండు ననిపిస్తూంది సుమండీ!

"ఇంకో వార్తా, చెప్పండి మరీ నన్ను ప్రిన్సిపాల్‌గా ప్రమోట్ చేసి మొగల్తుర్రు వేశారా! వ్హాట్! రియలీ! అబ్బబ్బ ఏం సస్పెన్సండీ, చంపేస్తు న్నారు! ఇంతకీ. అక్కడ. స్టూడెంట్సు స్ట్రెంగ్తు ఎంతట? పన్నెండొందలా అంటే పన్నెండూ ఇన్నూట పది, పన్నెండు వేలన్నమాట! అహహ ఏం లేమ. నా లెక్కేదో నోరు జారి పైకొచ్చే సింది లెండి! మొగల్తుర్రు తాలూకా కేంద్రమనుకుంటాను. అన్ని ఆఫీసులూ, ముఖ్యంగా ట్రెజరీ ఆఫీసూ, గాస్ కంపెనీ, ఆడపిల్లల స్కూలూ, ఆఫీసర్స్ క్లబ్బూ వగైరా ముఖ్యమైన వన్నీ ఉన్నాయనుకుంటా! ఆ అదే, అదే ఫరవాలేదు లెండి. ఏదో కొంత పేరు ప్రతిష్ఠలతో గెటాన్ అయిపోవచ్చు. క్లబ్బెందు కేమిటి— పరపతి కోసం కాదూ! పరపతి పుట్టేది పేకాటలోనే అని తెలీదా! ఆ, ప్రిన్సిపా లుద్యోగమైనా అంతే, ప్రైమ్ మినిస్ట రుద్యోగమైనా అంతే. అన్నట్టు డ్రామా ఆర్టిస్ట్ దొరికేది ఆ వూరే కదూ! ఏం గెయిటూ, ఏం గ్రేసూ, ఏం గెస్టిక్యులేషన్సూ! సర్లెండి, శుభవార్త చెప్పారు. అన్నట్టు హోటల్ థ్రిల్ కొచ్చెయ్యకూడదూ, రాత్రికి పార్టీ చేసేసుకుంటాం! ఓ. కే.

"ఆ ఏంటీ, నన్ను మొగల్తుర్రు వేశారు కానీ, కాన్సిల్ చేసి కొల్లేరేశారా! అది లాస్ట్ వీక్ మంత్రిగారు ఎనౌన్స్ చేసినకాలేజీయే కదండీ! నేనే మొదటి ఉద్యోగి ననుకుంటాను అక్కడ. డబ్బు కట్టించుకుని నేనే రసీదు లిచ్చి కుర్రాళ్ళని నేనే చేర్చుకోవాలనుకుంటాను, గోల!! మై గుడ్ గాడ్! తీసి కెళ్ళి బే ఆఫ్ బెంగాల్లో వెయ్యక పోయారు! ఈ వార్తయినా ఖాయమే నంటారా? అయినా ప్రమోషన్ లిస్టులో నా పైన నలుగు రున్నారు కదా ఆ నలుగురికీ వచ్చేసి నయ్యా పోస్టింగులూ అని! ఏం, చచ్చారా! థాంక్స్, మీకు థాంక్స్! మహా గొప్ప వార్త చెప్పారు కదూ! ఈ ముండ మోపి వార్తకి ఇంత సస్పెన్సా? ఇది మీకు మర్యాదేటండీ! కోపం ఉంటే ఇట్లాగా తీర్చుకోవటం! చాల్చా ల్లెండి.

"ఇంకో వార్తా? అక్కర్లేదు, పెట్టే స్తున్నాను. ఏ టీ, మీరు ముఖ్య మంత్రిగారి ఫ్రెండుకొడుకు కామర్సు లెక్చరరుగారు కాదూ. నా ఇంట్లో చిన్న వెధవ్వా! నాతో నీకు వేళాకోళ మేంట్రా రాస్కెల్! ఇంటికి పద చెబుతా న్నీ పని! ఏంటీ, నే న్నీకు చెప్పే నీతి కబుర్లు ఎంత వరకూ నేను పాటిస్తు న్నానో చూద్దామని గొంతు మార్చి మాట్లాడావా! ఫుండాకోర్! డర్టీ రోగ్! ఇన్సెక్ట్! నీ తోలు వల్చక పోతే చూడు!"

ట్రింగ్.

*